## అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

వినాయక్‌నగర్, జూన్ 13: నిజామాబాద్ జిల్లా కోర్టు ఆవరణలో జిల్లా జడ్జి సునీత కుంచాల సూచనల మేరకు న్యాయవాదులు, కోర్టు సిబ్బందికి అగ్నిప్రమాదాల నివారణపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. నిజామాబాద్ స్టేషన్ ఫైర్ ఆఫీసర్ నర్సింగ్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. మహిళలు ఇంట్లో వంట చేసే సమయంలో గ్యాస్ సిలిండర్ నుంచి ప్రమాదవశాత్తు మంటలు వచ్చినప్పుడు..వాటిని అదుపు చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో మాక్‌డ్రిల్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్మోహన్, సీనియర్ న్యాయవాదులు రాజ్‌కుమార్ సుబేదార్,మాణిక్ రాజ్, సీనియర్, జూనియర్ న్యాయవాదులు,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మంటలు అదుపుచేయడంపై అవగాహన కల్పిస్తున్న ఫైర్‌సిబ్బంది

## రోగుల ప్రాణాలతో చెలగాటం


- కాలం చెల్లిన మందులు ఇచ్చిన వైనం
- రోగానికి సంబంధం లేని మెడిసిన్ అంటగట్టిన సిబ్బంది
- పాతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఘటన

పాతంగల్, జూన్ 13 : ప్రభుత్వ దవాఖానల్లో రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కొందరు వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోగులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. తాజాగా కాలం చెల్లిన మందులు అంటగట్టిన ఘటన పాతంగల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వెలుగు చూసింది. అసలేం జరిగిందంటే.. పాతంగల్ మండలం హెగ్డోలి గ్రామానికి చెందిన శోభ కూతురు షుగర్ వ్యాధితో బాధ పడుతున్నారు. దీంతో ఆమె చక్కెర వ్యాధి నియంత్రించే మందులు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో మందుల కోసం శోభ ఐదు రోజుల క్రితం పాతంగల్ పీహెచ్‌సీకి వెళ్లారు. అక్కడి హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి కాలం చెల్లిన మందులతోపాటు రోగానికి సంబంధం లేని మందులు కూడా ఇచ్చారు. ఇది గమనించని శోభ వాటిని తీసుకెళ్లి కూతురికి ఇచ్చారు. విషయం తెలియక మందులు వాడడంతో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా మారింది. ఎందుకలా జరిగిందో తెలుసుకున్న శోభ గురువారం పీహెచ్‌సీకి వచ్చి వైద్యులు, సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే, ఫార్మాసిస్టు అందుబాటులో లేకపోవడంతో మాత్రలు గమనించకుండా ఇచ్చామని హెల్త్ సూపర్‌వైజర్ సాయికుమారి తెలిపారు. ఆరోగ్య సిబ్బంది అందుబాటులో లేకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని, వైద్యులు అందుబాటులో లేక అవస్థలు తప్పడం లేదని రోగులు పేర్కొంటున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఇలాంటివి జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



పాతంగల్‌లో హెల్త్ సూపర్‌వైజర్, సిబ్బందిని నిలదీస్తున్న రోగి తల్లి శోభ

# ధరణిపై నిర్లక్ష్యం






## రిజిస్ట్రేషన్ అనంతరం ఇబ్బందులు

- దళారులను ఆశ్రయిస్తే డైరెక్ట్ రిజిస్ట్రేషన్
- పాస్‌బుక్ జారీలో తీవ్రమైన జాప్యం
- బదిలీల కోసం ఇప్పటి నుంచే పైరవీలు
- రెవెన్యూ శాఖలో తాండవిస్తున్న నిర్లక్ష్యం
- ఉన్నతాధికారులు పట్టించుకోవాలని వినతులు

నిజామాబాద్, జూన్ 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : గత ప్రభుత్వంలో సవ్యంగా జరిగిన ధరణి వ్యవస్థలో ఇప్పుడు అడుగడుగునా నిర్లక్ష్యం తాండవిస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ వ్యవహారంపై దృష్టి సారించకపోవడంతో రైతులకు ఇక్కట్లు తప్పడం లేదు. వ్యవసాయ భూముల క్రయ, విక్రయాల్లో నెమ్మదించిన ప్రక్రియతో పట్టాదారులకు అంతులేని బాధను మిగిలిస్తున్నది. మొన్నటి వరకు క్రమపద్ధతిలో జరిగిన ధరణి రిజిస్ట్రేషన్లు ఇప్పుడు ఎందుకు అలసత్వం అంటుకున్నదో ఎవ్వరికీ అర్థం కావడంలేదు. తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను ధరణి సమస్యలపై రైతులు ప్రశ్నిస్తే తమ వద్ద ఏమీ లేదంటూ చేతులు ఎత్తేస్తున్నారు. కలెక్టరేట్‌కు వెళ్లి వివరాలు ఆరా తీస్తే ఇక్కడేం ఉండదని జవాబుదాటవేస్తున్నారు. మండలాఫీసుకు వెళ్లండంటూ తిరిగి పంపిస్తున్నారు. లేదంటే హైదరాబాద్‌లోని సీసీఎల్‌ఏను సంప్రదించాలంటూ హితవు పలుకుతున్నారు. వెరసి ధరణి మూలంగా ఇప్పుడు ఎదురవుతున్న సమస్యలతో రైతులకు అగచాట్లు తప్పడం లేదు. నిమిషాల్లో జరిగిన భూ బదలాయింపు నుంచి రోజుల వ్యవధిలోనే ఇంటికి చేరిన పట్టాదారు పాస్‌బుక్ దాకా కేసీఆర్ పరిపాలనలో ఇక్కట్లు అన్నవే మచ్చుకు కనిపించలేదు. ఇప్పుడు తీవ్రమైన జాప్యం జరుగుతున్నది.

### పాస్‌బుక్కుల జారీలో జాప్యం

గత ప్రభుత్వంలో ధరణి పోర్టల్ వచ్చాక పైరవీ అనే పదం కనిపించలేదు, వినిపించలేదు. భూ బదలాయింపు ప్రక్రియ గతంలో ఆలస్యమయ్యేది. ఆ సమస్య పూర్తిగా లేకుండా పోయింది. నిమిషాల్లోనే పనులు అయ్యేలా ధరణిని కేసీఆర్ సర్కారు రూపొందించి అమలు చేసింది. గతంలో రిజిస్ట్రేషన్ ఆఫీస్ వద్దకు వెళ్లి చాలా సేపు ఎదురు చూసే పరిస్థితికి చెక్‌పెడుతూ వ్యవస్థలో పెను మార్పు తెచ్చింది. ధరణితో రైతుల వ్యవసాయ భూములకు ప్రభుత్వం చట్టబద్ధత కల్పించడంతోపాటు రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన వారికి 10 నుంచి 15 నిమిషాల్లో పట్టా చేతికిచ్చి పంపేది. రైతులకు సులభంగా రిజిస్ట్రేషన్ పట్టాలు అందించాలనే ప్రభుత్వం ఒక సంకల్పంగా నెరవేర్చింది. గడిచిన ఐదారు నెలల్లో ధరణిలో రిజిస్ట్రేషన్లకు తంటాలు పడాల్సి వస్తున్నది. గంటల సేపు వేచి చూస్తే కానీ రిజిస్ట్రేషన్ అవ్వడం లేదు. సర్వర్ ప్రాబ్లమ్స్, అధికారుల సమయపాలన లోపంతో ఇదంతా జరుగుతున్నది. కలెక్టర్, అదనపు కలెక్టర్ల పర్యవేక్షణ లోపం కూడా తహసీల్దార్లకు ఆడిందే ఆట.. పాడిందే పాట అన్నట్లుగా ఉంది. ఎంపీ ఎన్నికల పేరిట తహసీల్ కార్యాలయాల్లో కుప్పలు తెప్పలుగా ధరణి స్లాట్లు పెండింగ్‌లో ఉండడమే ఇందుకు కారణం. ఏప్రిల్ నెలలో అక్కడక్కడా జరిగిన వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లకు సంబంధించి పాస్‌బుక్కులు చేతికి రాకపోవడం విడ్డూరంగా మారింది. పీపీబీ కోసం తహసీల్ కార్యాలయాల్లో వాకబు చేస్తే సీసీఎల్‌ఏ పేరు చెప్పి తప్పించుకుంటున్నారు. సరైన జవాబే ఇవ్వడం లేదు.

### దళారులను కాదని వెళ్తే కొర్రీలు


ఆపరేటర్ల ద్వారానే స్లాట్ బుకింగ్‌లు

నందిపేట్, జూన్ 13: దళారులను కాదని బయట స్లాట్ బుక్ చేసుకొని రిజిస్ట్రేషన్ కోసం తహసీల్ కార్యాలయానికి వెళ్లే దరఖాస్తుదారులకు చుక్కలు కనిపిస్తున్నాయి. దళారుల మధ్యవర్తిత్వంతో వచ్చే దరఖాస్తుల్లో పత్రాలు సరిపడా లేకున్నా పని సులువుగా అవుతుందని, బయట మీసేవా సెంటర్లలో స్లాట్ బుక్ చేసుకొని వెళ్తే మాత్రం లేని తప్పులు వెతికి పట్టుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఆర్మూర్ ప్రాంతాల్లోని కొన్ని తహసీల్ కార్యాలయాల్లో కేవలం ఆపరేటర్ల ద్వారానే అంతా జరుగుతున్నట్లు సమాచారం. దీంతో ఆపరేటర్లు పెట్టే కొర్రీలకు తలనొప్పులు ఎందుకని భావించి రైతులు దళారులను ఆశ్రయించి వారి ద్వారా స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్ చార్జీలతోపాటు ఎకరానికి ఇంతా అంటూ ముట్టజెప్పే పరిస్థితులు వచ్చినట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా ఆలూర్ తహసీల్ కార్యాలయంలో ఇలాంటి సంఘటనే ఎదురైతే రైతులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. దళారుల ద్వారా స్లాట్ బుక్ చేసుకునే వారి డాక్యుమెంట్‌లను సైతం చూపించకుండా నేరుగా రిజిస్ట్రేషన్‌కు వచ్చేయండంటూ ఆపరేటర్లు చెబుతుండడం, క్రయవిక్రయ డాక్యుమెంట్‌లో పేర్లు, వివరాలు సరిగ్గా ఉన్నాయా లేవా అనేది తెలియకుండానే రిజిస్ట్రేషన్లు పూర్తవుతున్నట్లు సమాచారం.

### వెళ్లిపోతాం కదా?

తహసీల్ కార్యాలయాల్లో ఇప్పుడంతా కొత్త వారు పనిచేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందట జరిగిన బదిలీల్లో ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న వారంతా వచ్చి నిజామాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ పని చేసిన వారంతా వేరే చోటికి బదిలీ అయ్యారు. ఎన్నటికైనా బదిలీ తప్పదనే భావనతో ఇప్పుడున్న వారిలో ఎక్కువ మంది పనిపై అంతగా శ్రద్ధ చూపడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెగ్యులర్‌గా జరిగే ప్రక్రియను సైతం లెక్కచేయకుండా గాలికి వదిలేసి నిర్లక్ష్యం వహిస్తున్నట్లుగా అర్థమవుతున్నది. ఎలాగూ బదిలీ అనివార్యమైన వేళ ఇదంతా నెత్తిన వేసుకోవడం దేనికి? అన్నట్లుగా చాలా మంది భావిస్తున్నారు. దీంతో రెవెన్యూ శాఖలో అంతులేని నిర్లక్ష్యం.. ప్రభావం కాస్తా రైతులపై పడుతున్నది. మొక్కుబడిగా వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్లను చేసి చేతులు దులుపుకొంటున్నారు. మిగిలిన పనులను చక్కబెట్టడం లేదు. కొంత మంది కేవలం వివాదాస్పద భూములనే టార్గెట్ చేస్తున్నట్లుగా ఫిర్యాదులు అందుతున్నాయి. నిజామాబాద్ జిల్లాలో మొన్నటి వరకు సివిల్ సప్లైస్‌లో డీటీలుగా పని చేసి తహసీల్ కార్యాలయాల్లోకి వచ్చిన వారంతా విధులకు డుమ్మా కొడుతున్నారు. తిరిగి అదే శాఖకు వెళ్లేందుకు పైరవీలు చేస్తున్నారు. పౌరసరఫరాల శాఖలో ఆమ్యామ్యాలకు అలవాటు పడిన డీటీలు తిరిగి వస్తామంటూ రైస్‌మిల్లర్లకు, దో నంబర్ దందాపరులకు ఫోన్లు చేస్తూ మేనేజ్ చేస్తున్నట్లుగానూ ఆరోపణలు వినిపిస్తున్నాయి

# ప్రాణదాతలు




**రక్తం.. శరీరానికి ఇంధనంలాంటిది..**

**కొందరికి రక్తం ఎక్కువ ఉంటే మరికొందరికి చాలా తక్కువగా ఉంటుంది. జీవన విధానం, పౌష్టికాహార లోపం, వ్యాధి నిరోధక శక్తి మందగించడం, ప్రమాదాల్లో గాయపడి రక్తస్రావం ఏర్పడినప్పుడు రక్తం కొరత ఏర్పడుతున్నది. ఆ లోటును పూడ్చేందుకు ఒకే ఒక్క అవకాశం.. రక్తం ఎక్కించడం. రక్తదానం చేసేవాళ్లు ఉంటేనే అత్యవసర పరిస్థితుల్లో ఇంకొకరి ప్రాణం కాపాడొచ్చు. ఆరోగ్య సమాజం కోసం ఇప్పుడు రక్తదాతలు అవసరం. నేడు ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం...**

**– కామారెడ్డి, జూన్ 13**

### రోజుకు పది మంది రక్తదానం..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆపదలో ఉన్న వారికి రక్తం దానం చేయాలనే ఆలోచనతో వీటీ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 2001 లో వీటీ ఠాకూర్ మెమోరియల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేశారు. ట్రస్టు ఆధ్వర్యంలో రోజుకు సుమారు 10మంది వరకు రక్తదానం చేస్తారు. రక్తాన్ని నిరుపేదలకు ఉచితంగా ఉపయోగిస్తారు. ట్రస్టు వ్యవస్థాపకుడు వీటీ రాజ్‌కుమార్ ఇప్పటి వరకు 102సార్లు రక్తదానం చేశారు.

### రక్తదాతల సమూహం..

కామారెడ్డి జిల్లా కేంద్రంలో రక్తదాతల సమూహాన్ని 2007లో నీల బాలచంద్రం (బాలు) నిర్వహించారు. ఇప్పటి వరకు 10వేల యూనిట్లకు పైగా రక్తాన్ని సకాలంలో అందజేసి మానవత్వాన్ని చాటుతున్నారు. 2016లో వాట్సాప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసి రెండు వేల నుంచి మూడు వేల మందితో రక్తం అవసరం ఉన్న వారు ఫోన్ చేసినా, వాట్సాప్‌లో మెస్సేజ్ పెట్టినా రక్తదాతల సమూహం నుంచి ఎవరైనా వచ్చి రక్తదానం చేస్తుంటారు. గర్భిణులు, ప్రాణాపాయస్థితిలో ఉన్నవారికి రక్తాన్ని అందించి ప్రాణాలను కాపాడుతున్నారు. ఇప్పటి వరకు 2306 యూనిట్ల రక్తాన్ని తలసేమియా చిన్నారుల కోసం సేకరించారు. ప్లాస్మా గ్రూప్ నుంచి ఇప్పటి వరకు సుమారు 65మందికి పైగా ప్లాస్మాదానం చేసి ప్రాణాలను కాపాడారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ చేతుల మీదుగా బాలుకు ఉత్తమ రక్తదాత పురస్కారం అందుకోనున్నారు. ఆపదలో ఉన్న వారు రక్తం కావాలనుకునే వారి కోసం 9492874006 ఫోన్ నంబర్‌ను ఏర్పాటు చేసి సకాలంలో స్పందిస్తున్నారు.

### 102 సార్లు రక్తదానం చేశా..

నేను 1980వ సంవత్సరం నుంచి రక్తదానం చేస్తున్నాను. 2001లో వీటీ ఠాకూర్ మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి ఎంతో మందికి ఉచితంగా రక్తదానం, ఉచిత కంటి ఆపరేషన్లు చేస్తున్నాం. ఇప్పటి వరకు 102సార్లు రక్తదానం చేశాను.

**- వీటీ రాజ్‌కుమార్, కామారెడ్డి**



### 73సార్లు రక్తదానం చేశా....



ఇప్పటి వరకు 73సార్లు రక్తదానం చేశాను. రక్తదాన సమూహం ఏర్పాటు చేసి ఎంతో మంది ప్రాణాలను కాపాడాం. వాట్సాప్ గ్రూప్ ద్వారా రక్తం అవసమున్న వారికి రక్తదానం చేస్తున్నాం. ఎవరికి ఏ ఆపద వచ్చినా రక్తదానం గ్రూప్ ద్వారా రక్తాన్ని సేకరించి అందిస్తాం.

**- బాలు, కామారెడ్డి**

### రక్తదానంతో ప్రాణాలు కాపాడవచ్చు...

రక్తదానం చేయడంతో ప్రాణాలను కాపాడొచ్చు. రక్తదానంతో ఎలాంటి హాని ఉండదు. మనకు కొత్త రక్తం వస్తుంది. సమాజంలో చాలా మంది రక్తం లేక ప్రాణాలను కోల్పోతున్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ద్వారా ఎంతో మందికి రక్తాన్ని అందిస్తున్నాం. ఇప్పటి వరకు 64సార్లు రక్తదానం చేశా.

**-డా.వేద ప్రకాశ్, కామారెడ్డి**



## కులమతాలకు అతీతంగా పండుగలు జరుపుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ పాటిల్

కామారెడ్డి, జూన్ 13: మత సామరస్యానికి ప్రతీక కామారెడ్డి అని, ఇక్కడి ప్రజలు కుల,మతాలకతీతంగా సుహృద్భావ వాతావరణంలో పండుగలు జరుపుకొనే సంప్రదాయం ఎంతో సంతోషంగా ఉన్నదని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో గురువారం ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ సింధు శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రార్థనా స్థలాలు, వధశాలల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచడంతోపాటు బ్లీచింగ్ పౌడర్‌ను చల్లాలని మున్సిపల్ కమిషనర్లు, పంచాయతీ అధికారులకు సూచించారు. నిబంధలనకు విరుద్ధంగా వివిధ వాహనాల్లో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ, పోలీసు అధికారులకు సూచించారు. ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఐదు చెక్‌పోస్టుల వద్ద నిఘా పెట్టామన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డి, ఆర్డీవోలు రంగనాథరావు, రమేశ్ రాథోడ్, జిల్లా పశు సంవర్ధక అధికారి సింహారావు, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దయానంద్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలి




నవీపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవీపేట/రెంజల్, జూన్ 13: విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను పెంపొందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు అంకితభావంతో పనిచేయాలని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా రెంజల్ మండలంలోని మోడల్‌స్కూల్, నవీపేట మండల కేంద్రంలోని బాలికల పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను గురువారం పంపిణీ చేసి మాట్లాడారు. ఇటీవల 11వేల టీచర్ పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసినట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యార్థులను సంఖ్యను పెంచి వారికి నాణ్యమైన విద్యాబోధన చేయాలని సూచించారు. మూడునెలలకోసారి తాను పాఠశాలలను తనిఖీ చేసి ఉపాధ్యాయులు బోధిస్తున్న తీరుపై ఆరా తీస్తానని అన్నారు. నాణ్యమైన చదువు అందించడంలో ఉపాధ్యాయులు విఫలం అయితే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా పదో తరగతిలో 10జీపీఏ సాధించిన విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో దుర్గాప్రసాద్, డీఆర్డీవో సాయాగౌడ్, ఎంపీపీ సంగెం శ్రీనివాస్, ఆర్డీవో రాజేందర్‌కుమార్, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎంపీపీ రాజేందర్‌కుమార్‌గౌడ్, తహసీల్దార్ నారాయణ, ఎంఈవో గణేశ్‌రావు పాల్గొన్నారు.

## గాలి దుమారం.. వర్ష బీభత్సం

- పడిపోయిన విద్యుత్ స్తంభాలు.. నేలకొరిగిన చెట్లు
- వెల్లుట్ల, వెంకటాపూర్‌ను వణికించిన ఈదురుగాలులు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 13: ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల, వెంకటాపూర్ గ్రామాలను ఈదురుగాలులు వణికించాయి. సుమారు అరగంటపాటు కురిసిన వర్షం బీభత్సం సృష్టించింది. ఒకవైపు భారీ వర్షం, మరోవైపు ఈదురుగాలులతో గ్రామస్తులంతా భయాందోళనకు గురయ్యారు. వెల్లుట్ల గ్రామంలో గాలిదుమారానికి పశువుల కొట్టాల పైకప్పు రేకులు, విఠలేశ్వరాలయానికి చెందిన ధర్మశాల రేకులు ఎగిరిపోయాయి. వెంకటాపూర్ గ్రామ పరిధిలోని రోడ్ల వెంట సుమారు 50 చెట్లు ఈదురుగాలులకు నేలకొరిగాయి. గ్రామంలో ఆరు విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇండ్లపై రేకులు ఎగిరిపోయాయి. స్థానిక నాయకుడు గౌలపల్లి మల్లేశ్ రోడ్డుపై, గ్రామంలో కూలిన చెట్లను, విద్యుత్ వైర్లను తొలగించారు.



వెంకటాపూర్‌లో గాలిదుమారానికి ఎగిరిపడిన ఇంటిపైకప్పు రేకులు



వెల్లుట్లలో ఎగిరిపడిన విఠలేశ్వరుని గుడి ధర్మశాల పైకప్పు రేకులు